క్లుప్తంగా

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు

మద్దికెర : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్ సూచించారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ బూత్‌ల వారిగా ఫారం -6 నింపిన వారి జాబితా తయారు చేసి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల నమోదు, బదిలీ, చిరునామా, ఫోటో మార్పుకునేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే చనిపోయిన వారు, పెళ్లి చేసుకొని వెళ్లిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను విచారణ చేసి జాబితా నుంచి తొలగించాలన్నారు. ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

హొలహర్వి ఎస్ఐగా చంద్ర



హొలహర్వి: మండల ఎస్ఐగా చంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సమస్యలు ఉన్న ప్రజలు నేరుగా తనదృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు.

చిన్నారుల్లో రక్త హీనతను తగ్గించాలి



హత్తిబెళగళ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ మద్దమ్మ

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో రక్తహీనతను తగ్గించాలని ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ ఆదేశించారు. మండలంలోని హత్తిబెళగళ్, ఆలూరు గ్రామాల్లోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల బరువు, రక్తహీనత, కార్యకర్తల పనితీరు తదితర అంశాలపై గురువారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం అందిన వెంటనే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

వరుణ యాగం ప్రారంభం

ఆస్పరి: తొగలుగల్లు గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం వరుణ యాగ పూజలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు నటరాజ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో గోపూజ, గంగానయనం, గణపతి పూజ, కలశ స్థాపన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రుద్రాభిషేకం, వేద మంత్ర పారాయణము, వరుణ మంత్ర జపం, శనివారం లక్ష్మీనరసింహ స్వామి తిరుమంజనం, రుద్ర, నవగ్రహ హోమాలు, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కృష్ణగిరి: గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు పంతాలు, పట్టింపులకు పోయి శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే.మల్లికార్జున హెచ్చరించారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, మన్నెకుంట, బి. ఎర్రబాడు, పోతుగల్లు, ఆగవేశి తదితర గ్రామాల్లో గురువారం పర్యటించి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల సమయంలో బైండోవర్ చేసిన వారు మళ్లీ తప్పు చేస్తే ష్యూరిటీ ప్రకారం జరిమానా విధిస్తామని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

వెల్దుర్తి: స్థానిక హైవేపై మోటార్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని రెండు రోజుల క్రితం వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీ కొన్న ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. డోన్ సుందర్‌సింగ్ కాలనీ చెందిన జీవీ వంశీకృష్ణనాయక్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగ నిమిత్తం ఈ నెల 20న ఉదయం డోన్ నుంచి (ఏపీ21బీకే2054) బైక్‌పై బయలుదేరి కర్నూలు వైపు వెళ్తుండగా వెల్దుర్తి వద్ద లిమ్రాస్ ఫంక్షన్‌హాల్ సమీపంలోకి రాగానే గొర్రెల మంద అడ్డంరాగా నెమ్మదిగా వెళ్తుండగా.. వెనుక నుంచి అతివేగంగా ఐచర్(కేఏ51ఏహెచ్7480) వాహనం ఢీకొట్టింది. దీంతో వంశీకృష్ణనాయక్ గాయాలపా కాగా గమనించిన గొర్రెల కాపర్లు వెంటనే 108లో కర్నూలు తరలించారు. ఐచర్ వాహన డ్రైవర్ వాహనాన్ని వదిలీ పరారయ్యాడు. బాధితుడు అన్న హరిచరణ్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బ్రెడ్డు, పండ్లు పంపిణీ

హొళగుంద: సినీ నటుడు చిరంజీవీ జన్మదినం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలోని రోగులు, గర్భిణులు, బాలింతలకు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, పంపాపతి, మండల కో ఆప్షన్ మెంబరు సాయిబేష్, విరుపాక్షి, దుర్గాప్రసాద్, రవికాంత్, నాగరాజుగౌడ్, ముదుసర్ తదితరులు గురువారం బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు.

వేతన వెతలు!

వారంతా చిరుద్యోగులు, రెక్కాడితే కానీ పూట గడవని స్థితి. అతితక్కువ వేతనానికి పనిచేస్తున్నా..ప్రభుత్వం ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. వారు ఒక్కరోజు విధులకు గైర్హాజరైతే ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆసుపత్రులను శుభ్రంగా ఉంచుతున్నా..తమకు జీతాలు ఇవ్వడం లేదని, కుటుంబం గడవడం కష్టంగా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం నుంచి స్పందన కొరవడిందని వాపోతున్నారు.

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య సిబ్బందికి ఆరు నెలలుగా అందని జీతాలు
- ప్రభుత్వం మారిన తర్వాత ఏజెన్సీలకు నిలిచిన బిల్లులు
- సిబ్బంది వేతనాలు చెల్లించని ఏజెన్సీ నిర్వాహకులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా చెల్లింపులు



ఆలూరు సీహెచ్‌సీ



ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. చివరకు చిరుద్యోగులకు వేతనాలు కూడా చెల్లించడం లేదు. దీంతో కుటుంబాలు గడవక వారు పడుతున్న ఆవేదన వర్ణనాతీతం. పేద ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వాసుపత్రుల నిర్వహణను సైతం గాలికొదిలేసింది. ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమించిన పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. అరకొరగా ఇచ్చే జీతాలు కూడా ఆరు నెలల నుంచి అందక వారంతా ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు.

ఆరు నెలలుగా అందని జీతాలు..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు ఔట్ సోర్సింగ్ ద్వారా సిబ్బందిని నియమించారు. ఆలూరు, పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒక్కో సెంటర్‌కు 9 మంది చొప్పున 18 మంది పనిచేస్తున్నారు. ఆయా వైద్యశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు తోడ్పడుతున్నారు. వీరికి కడపకు చెందిన థర్డ్ పార్టీ ఏజెన్సీ (చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ) ద్వారా జీతాలు చెల్లిస్తుంటారు. ఒక్కో పారిశుద్ధ్య ఉద్యోగికి రూ.12 వేలు చొప్పున జీతం చెల్లిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంబంధిత ఏజెన్సీలకు క్రమం తప్పకుండా జీతాల బిల్లులు చెల్లించింది. ఫిబ్రవరి నెల వరకు సిబ్బందికి ఏజెన్సీ ద్వారా జీతాలు అందాయి. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పాటు ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి వీరికి వేతన కష్టాలు మొదలయ్యాయి. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రెండు నెలలు దాటినప్పటికీ.. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు బిల్లులు విడుదల చేయకపోవడంతో చిరుప్రాణాలు విలవిల్లాడుతున్నాయి. ప్రతిరోజు క్రమం తప్పకుండా విధులకు హాజరై పనిచేస్తున్నప్పటికీ జీతాలు చెల్లించకపోవడంపై సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీరు ఒక్క రోజు విధులకు గైర్హాజరైతే వైద్యశాలల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతుంది. రోగులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. అలాంటి వారిని నిర్లక్ష్యం చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కుటుంబ పోషణ భారంగా మారింది



మాకు జీతాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. బయట మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. రెండు నెలలకోసారి జీతాలిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి మాకు జీతాలు అందేలా చూడాలి.

– రాధ, పారిశుద్ధ్య కార్మికురాలు, ఆలూరు సీహెచ్‌సీ

ఆరు నెలలుగా జీతాలు రాలేదు



మాది పేద కుటుంబం. ఆసుపత్రిలో పనిచేస్తే వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటు న్నా. అసలే అరకొర జీతం. అది కూడా ఆరు నెలలుగా రాలేదు. దీంతో బతుకు భారమైంది. డాక్టర్లను సంప్రదిస్తే కొద్ది నెలల నుంచి ఈ రోజు, రేపు జీతాలు వస్తాయంటున్నారు. జీతం కోసం ఆశగా ఎదురుచూస్తూ పనిచేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పెద్దలు కనికరించి మా పెండింగ్ జీతాలు ఇవ్వాలి.

– సరోజ, పారిశద్ధ్య కార్మికురాలు,ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి

నెలాఖరులో రావచ్చు



మా ఆసుపత్రిలో మొత్తం 8 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్నారు. సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడాను. ఈ నెలాఖరులోగా కొత్త ఏజెన్సీ నియామకం జరుగుతుందని చెప్పారు. తప్పనిసరిగా పెండింగ్ వేతనాలు విడుదల చేస్తామన్నారు. థర్డ్‌పార్టీ వారితో మాట్లాడి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– వాహిద్,ఆలూరు సీహెచ్‌సీ, మెడికల్ ఆఫీసర్

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు నాయక్

ఆలూరు రూరల్: యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆలూరు సీఐ శ్రీనివాసులు నాయక్ సూచించారు. గురవారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల పై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి చదువులకు దూరం కావద్దని చెప్పారు. చిన్నతనం నుంచే మత్తుకు బానిసైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. సరదా కోసం మత్తు పదార్థాలకు అలవాటుపడితే అది వ్యసనంగా మారుతుందని తెలిపారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సమావేశంలో ఆలూరు ఎస్ఐ నరసింహులు, కళాశాల కరస్పాండెంట్ కెంజెండప్ప,విద్యార్థులు హాజరయ్యారు.

కాశీం స్వామి ఊరేగింపు

తుగ్గలి : శ్రావణమాసం మూడో గురువారం సందర్భంగా మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో కాశీం పీరును ఊరేగించారు. గ్రామ సమీపంలోని పీర్లబండ నుంచి రాత్రి కాశీం పీరు ప్రతిమను గుర్రంపై ఉంచి మేళతాళాలతో పీర్ల చావిడి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బేస్‌లైన్ పరీక్షల తనిఖీ



జొన్నగిరిలో తనిఖీ చేస్తున్న ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌పై పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ పరీక్షలను గురువారం ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. నూతన విధానంలో రెండో రోజు నిర్వహించిన గణితం పరీక్షలో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా నెట్ సౌకర్యం, టెక్నికల్ సపోర్టు అందించారు. పరీక్షలను తనిఖీ చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 24 వరకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం ఉపేంద్ర, ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ సందర్శన

దేవనకొండ: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పిల్లల యోగక్షేమాలను, విద్యార్థుల పట్ల టీచర్లు ప్రవర్తిస్తున్న తీరును, మధ్యాహ్న భోజన పథకం అమలు, సబ్జెక్టుల వారీగా బోధన గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలని ఆదేశించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాఠశాలలకు కచ్చిత సమయంలో రావాలని చెప్పారు. హెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా కుంభోత్సవం



కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని నెరగల్లప్పస్వామి (భీరలింగేశ్వర) కుంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగపూజ అనంతరం భక్తులు కుంభాన్ని ఊరేగింపుగా స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయంలో ఆకు పూజ, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు బాగు చేసుకున్నారు



ప్రొక్లెయిన్‌తో మట్టిని చదును చేయిస్తున్న రైతులు

మద్దికెర : మద్దికెర– నంచర్ల పొలాలకు వెళ్లే దారి కంప చెట్లు పెరిగి రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడేవారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చందాలు పోగు చేసుకొని దాదాపు రూ.75 వేలు జమ చేసి ప్రొక్లెయిన్‌తో కంపచెట్లు తొలగించడమే గాకుండా మట్టి వేసి రోడ్డును బాగు చేసుకున్నామని రైతులు మాజీ ఎంపీపీ మల్లికార్జున, జయరామరాజు, మల్లయ్య గురువారం తెలిపారు. ఈ దారిలో నంచర్ల గ్రామం నుంచి మద్దికెరకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇబ్బందులు తీవ్రమవుతుంటంతో రైతులందరూ కలిసి చర్చించుకొని రోడ్డు బాగు చేసుకున్నామని చెప్పారు.

ఉద్యోగులపై భారం మోపొద్దు



పెండకేల్లు రైల్వే జంక్షన్ సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తుగ్గలి : ఉద్యోగులపై భారం మోపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగులు వ్యతిరేకించారు. ఈ మేరకు ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. పత్తికొండ బ్యాంకు బ్రాంచ్ పరిధిలోని 6 సహకార సంఘాల్లో ఉద్యోగులు గురువారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఒకేసారి అన్ని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఒత్తిడికి గురవుతున్నామన్నారు. శిక్షణ కూడా లేకుండా కంప్యూటరీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పీఏసీఎస్ ప్రతి లావాదేవీని జిల్లా కేంద్రానికి ఫ్యాక్స్‌లో పంపించాలనే నిర్ణయం సరికాదన్నారు. ఆందోళనలో భాగంగా ఈనెల 23వ తేదీన సహకార సంఘాల్లో పెన్‌డౌన్, 24 చలో విజయవాడ ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు మారెల్ల, ఉప్పరల్లి సహకార సంఘాల సీఈవోలు మనోహరనాయుడు, గిడ్డయ్య తెలిపారు.

ప్రమాదపు అంచున అలారుదిన్నె వంతెన

- బ్రిడ్జి ఏర్పాటై 84 యేళ్లు పూర్తి
- దెబ్బతిన్న రెయిలింగ్
- రోడ్డు గుంతలమయం



అలారుదిన్నె బ్రిడ్జి సైడ్ వాల్స్ కూలిన దృశ్యం

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఈ బ్రిడ్జి 1940లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించింది. బ్రిడ్జి ఏర్పాటై ఇప్పటికీ 84 యేళ్లు పూర్తి అయ్యింది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి దేవనకొండ మీదుగా కర్నూలుకు రాకపోకలు సాగించేవారు. నేటికీ ఈ బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. బ్రిడ్జి సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. బ్రిడ్జిపై ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యం బళ్లారి నుంచి కర్నూలుకు వెళ్లే దారిలో ఉండే ఈ బ్రిడ్జిపై భారీ నుంచి అతి భారీ వాహనాలు నిత్యం పదుల సంఖ్యలో వెళ్తుంటాయి. రెయిలింగ్ ఒకవైపు కూలినా, బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. హంద్రీ వాగు ప్రవహించే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రస్తుతం హంద్రీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాదాలు చోటు చేసుకోక ముందే యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తుగ్గలి ఉపాధి కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న ఎంపీడీఓ సావిత్రి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క (ప్లాంట్ ఫర్ మదర్) అనే గ్లోబల్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో పలుచోట్ల మొక్కలు నాటారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద, రాంపల్లి, బొందిమడుగులతో పాటు పలు గ్రామాల్లో ఏపీఓ రామకృష్ణతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈసీ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి

దేవనకొండ: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఎంపీడీఓ గౌరీదేవి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని పిలుపు మేరకు మొక్కలను నాటామన్నారు. ఏఓ ఇద్దూర్‌బాషా, ఈఓపీఆర్డీ డి.సూర్యానారాయణ పాల్గొన్నారు.

పత్తికొండ (అర్బన్): పర్యావరణాన్ని రక్షించి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు గురువారం పత్తికొండ ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఎమ్మెల్యే తన మాతృమూర్తి పేరిట మొక్కనాటారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప, ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడుతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వక్తలు కోరారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, పీహెచ్‌సీ, జూనియర్ కాలేజ్, కేజీబీవీ తదితర కార్యాలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చురుకుగా సాగింది.

ఎన్నేళ్లకెన్నేళ్లకు!



మరువ పారుతున్న జొన్నగిరి చెరువు

తుగ్గలి: కొన్నేళ్లుగా గ్రామంలో ఏటా వేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పదిహేడేళ్లలో నాలుగైదు సార్లు మాత్రమే చెరువు నిండింది. ఏటా చెరువు నిండక పోవడంతో వరి పంట సాగు లేక ఆయకట్టు ముళ్ల కంపలతో నిండిపోయింది. తమ భూమి ఎక్కడ ఉందో కూడా రైతులు గుర్తుపట్ట లేనంతగా కంప చెట్లు పెరిగిపోయాయి. చెరువు కింద 350 ఎకరాల ఆయకట్టు ఉంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జొన్నగిరి చెరువు జలకళను సంతరించుకుంది. చెరువు నిండినా ఆయకట్టు ముళ్ల కంపలతో నిండి ఉండటంతో వరిసాగు కష్టతరంగా మారింది. తాగునీటికి మాత్రం ఈ సారి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

ఆస్పరి: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా చేపట్టబోయే పనులపై గ్రామ సభల్లో తీర్మాణం చేసి జిల్లా అధికారులకు పంపునున్నట్లు పేర్కొన్నారు.

మద్దికెర : ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సుహాసిని, ఈఓ శివకుమార్ గురువారం తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరంలో చేపట్టవలసిన 46 పనులకు సంబంధించి గ్రామ సభ జరుగుతుందన్నారు. రైతులు తమ పొలాల్లో ఉపయోగపడే పనుల గురించి తెలియజేస్తే చర్చిస్తామన్నారు. అలాగే గ్రామంలో అభివృద్ధి పనుల గురించి చర్చించి ప్రతిపాదనలు తయారుజేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించి విధివిదాలు రూపొందించేందుకు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ విశ్వమోహన్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి ఉపాధి కూలీలకు వారి హక్కులు, పనుల మంజూరుపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులపై చర్చించి తీర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీకి నోడల్ అధికారులుగా మండలాధికారులను నియమిస్తున్నామని తెలిపారు. ఏపీఓ శేషిరెడ్డి, అన్ని గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వేదావతిలో పెరిగిన వరద ఉధృతి



మార్లమడికి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నదిలో గురువారం వరద ఉధృతి మళ్లీ పెరగడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి మంగళవారం మధ్యాహ్నం నదిలో భారీగా వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉధృతి తగ్గినట్టే తగ్గి రాత్రి మళ్లీ పెరగడంతో నది నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. హొళగుంద–బళ్లారి, సిరుగుప్పలకు ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు నిలిచిపోయి విద్యా, వైద్య, వ్యాపార పరంగా చాలా మంది ఇబ్బందులు పడ్డారు. దీంతో అధిక శాతం మంది ఆలూరు మీదుగా ఆదోని, బళ్లారికి రాకపోకలు సాగించారు. గురువారం రాత్రి కూడ ఉధృతి తగ్గక పోవడంతో పాటు ఇంకా పెరుగుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే.. హొళగుంద–ఆదోని మార్గంలోని నాగనాథనహళ్లి వద్ద గర్జివంక పొంగి ప్రవహిస్తోంది.

పంటలు నష్టపోయిన రైతుల వివరాలు పంపండి

- జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు
- గూళ్యం, బాపురం గ్రామాల్లో నీట మునిగిన పంటల పరిశీలన




గూళ్యంలో నీట మునిగి కుళ్లిన టమాట పంటను పరిశీలిస్తున్న రామాంజనేయులు

ఆలూరు: భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సచివాలయాల్లో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లను జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు ఆదేశించారు. గురువారం హొలహర్వి మండలం గూళ్యం, బాపురం, అమృతాపురం, సిద్దాపురం, హొలహర్వి, జే.హొసళ్లి తదితర గ్రామాల్లో వరద కారణంగా దెబ్బతిన్న పత్తి, వేరుశనగ, టమాట, మిరప, ఆకుకూరలు, పండ్ల తోటలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి, చిప్పగిరి, హొలహర్వి, దేవనకొండ, హొళగుంద మండలాల్లో పంటలు నష్టపోయిన రైతులు జాబితా, నష్టాన్ని అంచనా నివేదికను ఎంపీఈఓలు త్వరగా పంపాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదిక రూపొందించాలని చెప్పారు. పండ్ల తోటలు నష్టపోయిన రైతులు జాబితాను ప్రత్యేకంగా అందజేయాలని ఆలూరు హార్టికల్చర్ అధికారిణి ఇందిరను ఆదేశించారు. అలాగే ఆలూరులోని ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలకు వడ్డిస్తున్న ఆహారం, తాగునీటి వసతి తదితర అంశాలపై హెచ్‌డబ్ల్యూఓ సుజాతను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌డబ్ల్యూఓలు, ఎంపీఈఓలు ఉన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దెలు





ఇబ్రహీం ఇల్లు వర్షానికి కూలిన దృశ్యం, కూలిన ఆదిలక్ష్మికి చెందిన మిద్దె

వెల్దుర్తి: బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలో రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. అయితే ఈ ప్రమాదాల్లో ఎవరికీ ఏమీ కాలేదు. 13వ వార్డులో నివాసం ఉంటున్న ఇబ్రహీం ఇంట్లోని మధ్య భాగం రాత్రి కూలిపోయింది. అయితే కుటుంబ సభ్యులంతా వరండాలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే 7వ వార్డులోని ఆదిలక్ష్మి తన అత్త శేషమ్మ, కుమారుడు సూరత్ నాయుడుతో కలిసి ఇంట్లో ఉంది. రాత్రి మధ్య గదిలో పడుకోగా లోపలి గది కూలిపోయింది. దీంతో వీరికి కూడా ప్రమాదం తప్పింది. రెండు ఇళ్లలోని వస్తువులు దెబ్బతినడంతో దాదాపు రూ.1.5 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం అదుకోవాలని బాధితులు కోరారు.